

	ఇఫ్తార్	సెహరి
	శుక్రవారం	శనివారం
కర్నూలు	6:33	5:05
నంద్యాల	6:29	5:04

నేత్రపర్వం నృసింహుడి రథోత్సవం



ఎగువ అహోబిలంలో అశేష భక్తవాహిని నడుమ కొనసాగుతున్న రథోత్సవం

అళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 13(ఆంధ్రజ్యోతి): 'జయజయ సింహా.. జయనారసింహా..' నినాదాలతో ప్రముఖ వైష్ణవక్షేత్రం అహోబిలం మార్మోగింది. వేలాది గొంతుకలు గోవిందనామస్మరణతో చేస్తుండగా జ్వాలా నరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా సాగింది. నల్లమల అటవీ ప్రాంతంలో ప్రకృతి రమణీయత మధ్య ఉగ్ర నారసింహుడి అవతారంలో స్వయంభువుగా కొలువైన ఎగువ అహోబిల క్షేత్రం భక్తుల గోవింద నామస్మరణతో పులకించింది. వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాలతో జ్వాలా నరసింహస్వామి రథోత్సవం ఎగువ అహోబిలంలో గురువారం అత్యంత రమణీయంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉభయదేవేరులతో కొలువైన జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు ఉదయం శాస్త్రోక్తంగా నవకలశ తిరుమంజనం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత జ్వాలా నృసింహస్వామి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించి మేళతాళాలతో ఆలయం వెలుపల ఉన్న రథం వరకు తీసుకొచ్చారు. శోభాయమానంగా ముస్తాబు చేసిన రథంలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి రథాంగ పూజలు, మంగళహారతి సమర్పించి రథోత్సవాన్ని ప్రారంభించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్, ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో రథోత్సవ వేడుకలు జరిగాయి.

'దిగువ'లో నేడు రథోత్సవం

అహోబిల లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలంలో శుక్రవారం వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం ఉత్సవం నిర్వహిస్తారు. అలాగే ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి ఉదయం ఉత్సవం, సాయంత్రం ద్వాదశ ఆరాధనం పుష్పయాగం చేపడతారు. రాత్రి సంప్రదాయబద్ధంగా వేదపండితులు గరుడోత్సవం, ధ్వజావరోహణం నిర్వహిస్తారు.

- ఎగువ అహోబిలంలో ఘనంగా రథోత్సవం
- గోవింద నామస్మరణతో పులకించిన అహోబిల క్షేత్రం
- దిగువలో కాళింగ నర్తనోత్సవం, తొట్టి తిరుమంజనం
- అశ్వ వాహనంపై విహరించిన ప్రహ్లాదవరదస్వామి



శ్రీదేవీ, భూదేవీ సమేతుడై ఆలయ మాడవీధుల్లో విహరిస్తున్న ప్రహ్లాదవరదస్వామి

ఘనంగా 'కాళింగ నర్తనోత్సవం'

బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిల క్షేత్రంలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కాళింగనర్తనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, తొట్టి తిరుమంజనం నిర్వహించారు. పట్టువస్త్రాలతో ప్రహ్లాదవరదస్వామి అశ్వ వాహనంపై కొలువుదీరి ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.



శ్రీదేవీ, భూదేవీ సమేతంగా దర్శన మిస్తున్న శ్రీవారు

న్యూస్ బాక్స్

ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు

చివరి రోజు 604 మంది గైర్హాజరు



స్వగ్రామాలకు వెళుతున్న విద్యార్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. 53 పరీక్షా కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 604 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఐఈవో సునీత మాట్లాడుతూ జనరల్ పరీక్షకు 14,758 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి వుండగా 14,235 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 523 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు 1,087 మంది విద్యార్థులకు గాను 1,006 మంది విద్యార్థులుగా హాజరు కాగా 81 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 604 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

28న డాక్ అదాలత్

కర్నూలు న్యూసిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో అందిస్తున్న సేవలపై ఈనెల 28న డాక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దనరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండు వద్ద ప్రధాన తపాలా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. డాక్ అదాలత్‌కు పోస్టాఫీసు సేవలపై ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే పోస్టు కవర్ ద్వారా పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దనరెడ్డి, కర్నూలు డివిజనల్ కార్యాలయం, పాత బస్టాండు అడ్రసుకు ఈ నెల 24వ తేదీ లోగా పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



జనార్దన్‌రెడ్డి, డీఈవో, నంద్యాల

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):

ప్రశ్న : 10వ తరగతి పరీక్షలు ఎన్ని సెంటర్లలో నిర్వహిస్తున్నారు?

జవాబు : జిల్లా వ్యాప్తంగా 130 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : ఎన్ని పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు?

జవాబు : జిల్లాలో ఎయిడెడ్ 16, బీసీ వెల్ఫేర్ 6, ప్రభుత్వ పాఠశాలలు 12, ప్రభుత్వ ఆశ్రమ ట్రైబల్ వెల్ఫేర్ 5, కేజీబీవీ 27, మున్సిపాలిటీ 4, మోడల్ స్కూల్స్ 20, ప్రైవేట్ 173, సోషల్ వెల్ఫేర్ 6, ట్రైబల్ వెల్ఫేర్ 7, జిల్లా పరిషత్ 182 పాఠశాలల నుంచి మొత్తం 25,542 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

ప్రశ్న : పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించారా..?

జవాబు : అన్ని కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, బెంచీలు మొదలైన సౌకర్యాలన్నింటినీ కల్పించాం. వీటిని పర్యవేక్షించేందుకు ఆయా మండలాల విద్యాధికారులను నియమించాం. వారందరూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కలెక్టర్‌కు నివేదిస్తున్నాం.

ప్రశ్న : పరీక్షల నిర్వహణకు ఎంత మంది పర్యవేక్షకులను నియమించారు?

జవాబు : 130 సెంటర్‌లకు 130 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదు టీమ్‌లు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 20 టీమ్‌లు సిట్టింగ్ స్క్వాడ్లను నియమించాం.

ప్రశ్న : ఎన్ని సమస్యాత్మక పరీక్షా కేంద్రాలను గుర్తించారు.. ఏ చర్యలు తీసుకున్నారు?

జవాబు : గడివేముల, శిరివెళ్ల, రుద్రవరం, అంకిరెడ్డిపల్లె, నొస్సం జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు నందికొట్కూరు బాలికల పాఠశాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. అక్కడ సిసి కెమెరాలు ఏర్పాటుచేశాం. కలెక్టర్ పర్యవేక్షణలో ఆరు కేంద్రాలను ప్రత్యేక అధికారులను నియమించారు.

ప్రశ్న : ప్రశ్నాపత్రాల భద్రత పట్ల ఏం చర్యలు తీసుకున్నారు?

జవాబు : 12 రూట్‌ల వారీగా ప్రశ్నాపత్రాలను తరలించి పోలీస్‌స్టేషన్‌లలోని స్ట్రాంగ్ రూమ్‌లలో సీసీ కెమెరాల నిఘా మధ్య ఉంచాం.

ప్రశ్న : పరీక్షలు ఎన్ని గంటలకు ప్రారంభమవుతాయి. ఆలస్యంగా వస్తే అనుమతిస్తారా..?

జవాబు : పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై 12.45 గంటలకు ముగుస్తుంది. అయితే ఉదయం 10 గంటల తర్వాత పరీక్షా సెంటర్‌లోకి విద్యార్థులకు అనుమతి ఉండదు.

ప్రశ్న : ఎప్పటికప్పుడు పరీక్షలను మానిటరింగ్ చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

జవాబు : జిల్లా కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశాం. అక్కడ ఒక ఎంఈవో, ఒక సిట్టింగ్ స్క్వాడ్, ఒక అటెండర్, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాం. వారు పరీక్షా కేంద్రాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించేలా అన్ని చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : దివ్యాంగులకు పరీక్షా కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేశారా..?

జవాబు : ప్రతి కేంద్రంలో దాదాపు ర్యాంపులు ఉన్నాయి. లేనిచోట ప్రత్యేక సిబ్బంది ఏర్పాటుచేసి దివ్యాంగులను పరీక్షా హాల్‌కు తీసుకెళ్లే విధంగా ఏర్పాటు చేశాం.

ప్రశ్న : పరీక్షా విధులకు ఇన్విజిలేటర్లుగా ఎవరిని నియమించారు?

జవాబు: పరీక్షా విధులకు ముందుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించాం. ప్రభుత్వ ఆదేశానుసారం ఎస్జీటీలను కూడా విధులకు తీసుకున్నాం.

బడి బాగుండాలని..!



హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఆగిపోయిన అదనపు తరగతి గదులు

కర్నూలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో 1,664 మంది విద్యార్థులు ఉన్నారు. అవసరమైన మేరకు తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.2.34 కోట్లతో 20 అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. కష్టాలు తీరుతాయని విద్యార్థులు సంతోషించారు. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో పిల్లర్లు, మొండి గోడలతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. హొళగుందలో ఒక్కటే కాదు జిల్లాలో 1,074 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి దాదాపు ఇదే. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల అసంపూర్తిగా ఆగిపోయిన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. 'మన బడి-మన భవిషత్తు' ఫేజ్-2 కింద తక్షణమే పూర్తి చేయడానికి రూ.29.83 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రంలో జిల్లాకే కేటాయించడం కొసమెరుపు. పేద విద్యార్థులు విద్యాభ్యాసం చేసే ప్రభుత్వ బడులకు మంచి రోజులు వచ్చాయంటూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో వివిధ పాఠశాలలు 2,251 ఉన్నాయి. ఆయా విద్యాలయాల్లో 4.50 లక్షలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం వివిధ పథకాల కింద ఏటా రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నా.. ఇప్పటికీ ఆయా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేమితో పేద విద్యార్థులు పడుతున్న అవస్థలెన్నో. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యాలయాల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ, మరుగుదొడ్లు, తాగునీరు, ప్రతి గదిలో ఓ ఫ్యాన్, ట్యూబ్‌లైట్లు, ఫర్నీచర్, రంగులు, మరమ్మతులు, ఆకుపచ్చ శుద్ధ బోర్డు వంటి సౌకర్యాలు కల్పిస్తామని 'నాడు-నేడు' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. జిల్లాలో ఫేజ్-2 కింద 1,074 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపిక చేసి దాదాపు రూ.521 కోట్లతో 1,746 పనులు చేపట్టారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికిన వైసీపీ పెద్దలు ఆచరణలో ఘోర వైఫల్యాన్ని మూటగట్టుకున్నారు. నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. పనులు చేసిన పాఠశాల యాజమాన్య కమిటీలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక 'మన బడి-మన భవిష్యత్తు' పేరిట విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసంపూర్తి పనులపై దృష్టి సారించారు.

అసంపూర్తి పనులు.. అవస్థల్లో విద్యార్థులు

జిల్లాలో 1,074 వివిధ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 'మన బడి నాడు-నేడు' ఫేజ్-2 కింద 1,746 పనులు గుర్తించారు. అందులో 311 పాఠశాలల్లో 1,311 అదనపు తరగతి గదులు, 367 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణ పనులు మంజూరు చేశారు. 35-40 శాతం పనులు పూర్తి చేయలేదు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు.. ఇలా వివిధ నిర్మాణాలు పిల్లర్లు, మొండి గోడలతో అసంపూర్తిగా ఆగిపోయాయి. సకాలంలో నిధులు ఇవ్వకపోవడం, బిల్లులు కూడా రాకపోవడంతో పనులు చేసిన పాఠశాలల యాజమాన్య కమిటీలు ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. అసంపూర్తి పనుల వల్ల విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. 2024 జూన్ 12న కొలుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం 'మన బడి-మన భవిష్యత్తు' ఫేజ్-2 కింద అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టింది.

- జిల్లాలోని పాఠశాలలకు రూ.29.83 కోట్లు విడుదల
- వైసీపీ హయాంలో నిలిచిన నాడు-నేడు పనులు
- టీడీపీ కూటమి వచ్చాక విద్యాలయాల అభివృద్ధిపై దృష్టి
- తక్షణమే 'మన బడి-మన భవిష్యత్తు' ఫేజ్-2 పనులు చేపట్టేలా ఆదేశం

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆగిపోయిన పనులు కొన్ని

- హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో 1,664 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో నాడు-నేడు కింద రూ.2.34 కోట్లతో 20 అదనపు తరగతి గదులు మంజూరు కాగా.. 9 గదుల నిర్మాణాలు మొదలు పెట్టారు. మూడు గదులు టాప్ లెవల్, ఆరు గదులు లెంటిల్ లెవల్‌లోనే అసంపూర్తిగా ఆపేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వడంతో పనులు మొదలు కానున్నాయి.
- కోసిగి మండలం చిన్నబొంపల్లి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో 678 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. రూ.1.20 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. రూ.76 లక్షలు ఖర్చు చేశారు. బిల్లులు రాకా.. అవసరమైన నిధులు మరో రూ.40 లక్షలు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మిగతా 7వ పేజీలో

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టరు రాజకుమారి

పాణ్యం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టరు రాజకుమారి వైద్యులను ఆదేశిం చారు. గురువారం పాణ్యం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి సిబ్బంది పనితీరు, రోగులకు సౌకర్యాలు, సదుపాయాలను పరిశీలించారు. నైట్ డ్యూటీలు రోస్టర్ రిజిస్టర్ ప్రకారం షిఫ్ట్ పద్ధతిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. నెలకు ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయి? సాధారణ, సిజేరియన్‌ల సంఖ్య ఎంత? అని అడిగి తెలుసుకున్నారు. సిజేరియన్ డెలివరీలే ఎందుకు అధికంగా జరుగుతున్నాయని ప్రశ్నించారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో నలుగురు వైద్యులు ఉండగా ఒక్క అనస్తీషియా వైద్యుడే ఎందుకు విధులు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒకరు నైట్ డ్యూటీ చేశారని, మరొకరు ట్రైనింగ్ కు వెళ్లారని వైద్య సిబ్బంది తెలిపారు. రోగులకు వైద్యం అందించాల్సిన సమయంలో ట్రైనింగ్‌కు ఎందుకు వెళ్లారని ఇందుకు సంజయిషీ ఇవ్వాలని కలెక్టరు ఆదేశించారు. రోగులతో కలెక్టరు వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈఈ హాస్పిటల్ ఆన్‌లైన్ రిజిస్టరు, ఫార్మసీ రికార్డులు, డెలివరీ రిజిస్టర్, లేబరేటరీ తదితర రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో మందులు స్టాక్ అయిపోకముందే ఇండెంట్ చేసి తెప్పించు కోవాలన్నారు. ఆసుపత్రిలో అంతర్గత రోడ్లు, లైటింగ్ లేదని



రోగులతో మాట్లాడుతున్న కలెక్టరు

రోగులు కలెక్టరు దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం కలెక్టరు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణాన్ని తనిఖీ చేసి సదుపాయాల గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్ పోర్టల్‌లో ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపికైన అభ్యర్థుల వివరాలు

నంద్యాల నూనెపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల లిస్టును విడుదల చేసినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి ఎం.చింతామణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఉచిత డీఎస్సీ శిక్షణ కొరకు అభ్యర్థుల వివరాలు వెబ్‌పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఉచిత డీఎస్సీ కొరకు అభ్యర్థులు తమ లాగిన్‌లో శిక్షణా సంస్థలను ఎంపిక చేసుకోవలసిందిగా ఆమె కోరారు. షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులందరూ తమ వెబ్ ఆప్షన్లను జ్ఞానభూమి పోర్టల్‌లో ఈ నెల 15లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

లా సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 3, 5 సంవత్సరాలకు సంబంధించిన 2,4,6,8,10 సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. గురువారం ఉదయం ఉపకులపతి డాక్టర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు వివరాలను వర్సిటీ వెబ్ సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే బుడ్డా


చంద్రబాబుతో బుడ్డా

ఆత్మకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును గురువారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమరావతిలోని అసెంబ్లీలో గల సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులను ఆయనకు అందజేశారు.

కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, కడప జిల్లాల పరిధిలోని కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం అసెంబ్లీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2004లో 10 టీఎంసీల నీటిని కేసీ కెనాల్ నుంచి హెచ్ఎల్సీ మీదుగా అనంతపురం జిల్లాకు తీసుకెళ్లాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్ణయించినట్లు తెలిపారు. ఆ సమయంలో కర్నూలు జిల్లాలు రైతులు తీవ్రంగా నష్టపోతుండటంతో ప్రతిపక్ష హోదాలో టీడీపీ నాయకులు రైతులతో కలిసి పాదయాత్ర ద్వారా ఉద్యమించినట్లు గుర్తుచేశారు. దీంతో దిగొచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి జీవో నెంబరు 3 పేరిట గుండ్రేవుల ప్రాజెక్టును ప్రకటించారని చెప్పారు. అయితే ఆ తర్వాత కాంగ్రెస్, వైసీపీ ఈ ప్రాజెక్టును అటకెక్కించారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో కూడా గంప మట్టి వేయలేదన్నారు. మొత్తానికి సుమారు 20 ఏళ్లుగా కేసీ కెనాల్ ద్వారా 10 టీఎంసీల నీటిని అనంతపురానికి మళ్లించడం వల్ల కర్నూలు, కడప రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ విషయాలను మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంలో కూడా ఆయనకు వివరించినట్లు వెల్లడించారు. అదేక్రమంలో 2014-2019 టీడీపీ హయంలో తమనేత చంద్రబాబు ముచ్చుమర్రి ఎత్తిపోతలను పూర్తి చేసి కేసీకెనాల్‌కు 1000 క్యూసెక్కుల నీటిని అందించారని తెలిపారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు గుండ్రేవుల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి కేసీకెనాల్ ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని కోరారు.

'మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి'


విదార్థులకు ప్యాడ్, పెన్నులు పంపిణీ చేస్తున్న దొరబాబురెడ్డి

నందికొట్కూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని టీడీపీ నాయకుడు మందాడి దొరబాబురెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం జూపాడుబంగ్లా మండలం తరిగోపుల గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి'

కొత్తపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి, గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్ సెంటర్లలో ఈ నెల 17 నుంచి 31 వరకు జరిగే పదీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో-2 ఇనయతుల్లా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్తపల్లి, గోకవరం సెంటర్లలో మొత్తం 291 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. కొత్తపల్లి సెంటరులో జరిగే పరీక్షలకు చీఫ్ ఎగ్జామినర్లుగా వెంకటరమణ ఆచారి, డిపార్టుమెంట్ అధికారిగా ఇబ్రహీం, గోకవరం సెంటరుకు చీఫ్‌గా వెంకటశివుడు, డిపార్టుమెంట్ అధికారిగా రఘుస్వామి వ్యవహరిస్తారని ఎంఈవో తెలిపారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

మహానంది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను మహానందిలో ఘనంగా నిర్వహించారు. మహానంది సమీపంలోని శాలివాహన అన్నదాన సత్రం ఆవరణలో కమిటీ ప్రధాన కార్యదర్శి శివశంకర్, కోశాధికారి గురునాథ్‌తో పాటు ఉపాధ్యక్షుడు శివయ్య గురువారం మొల్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగిశెట్టి, రంగస్వామి, నాగభూషణం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 16 రోజుల పండుగ


మహానందిలో కామేశ్వరీదేవికి చీర, సారెను అందజేస్తున్న ఆర్యవైశ్య మహిళలు


ఓంకార క్షేత్రంలో..

మహానంది, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహానంది దేవస్థానంలో శివరాత్రి బ్రహోత్సవాల అనంతరం 16 రోజుల పర్వదినం వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని యాగశాల మంటపంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల తొలి రోజు చేసిన అంకురార్పణలో వచ్చిన మొలకలను క్షేత్రంలోని రుద్రగుండం కోనేరులో వేదపండితులు అధికారుల చేత కలిపారు. అనంతరం చండీశ్వరుడు, అస్త్ర దేవతలతో రథ ం వద్దకు వెళ్లి రథ దేవతలను ఉద్వాసన చేసి విశేష నైవేద్యాలు సమర్పించారు. మహానందికి చెందిన ఆర్యవైశ్య సంఘం మహిళలు ఆలయంలోని కామేశ్వరీదేవి అమ్మవారికి చీర, సారె అందజేశారు. దీంతో మహా శివరాత్రి రోజున జరిగిన కామేశ్వరీదేవి, మహానందీశ్వరుని కల్యాణ, బ్రహ్మోత్సవ దీక్ష నేటితో పూర్తవుతుందని ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మలు తెలిపారు. అనంతరం భక్తి శ్రద్ధలతో భక్తుల శివనామస్మరణ మధ్య రథాన్ని రథశాలలోకి లాగారు. ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, దేవిక, టెంపుల్ ఇన్స్పెక్టర్లు నీలకంఠరాజు, శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు యాదవ్, మహానంది ఆర్యవైశ్య సంఘం మహిళలు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో మహాశివరాత్రి మహోత్సవాల అనంతరం పదహారు రోజుల పండుగను ఆలయ ఈవో నాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకులు మల్లికార్జున ముందుగా గంగా ఉమా సమేత సిద్ధేశ్వర స్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం రథానికి పునఃస్థల పూజలు చేసి, రథ మండపంలోకి రథాన్ని చేర్చారు. చెన్నారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నారాయణ, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో గురువారం 16 రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్, సిబ్బంది పాల్గొన్నారు.


దుర్గాభోగేశ్వరంలో రథానికి పూజలు చేస్తున్న ప్రధాన అర్చకుడు

'పనిభారం తగ్గించాలి'

నంద్యాల రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పనిభారాన్ని తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో సుగుణశ్రీ, ఈవోఆర్డీ శివనాగజ్యోతికి వినతి పత్రం అందజేశారు. పీఎస్ నరేంద్ర మాట్లాడుతూ 39 రకాల సేవలను అందించడంలో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 14 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండంలోని వివిధ గ్రామాల పంచాయితి కార్యదర్శులు పని ఒత్తిడి తగ్గించాలని మిడుతూ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దశరథరామయ్యకు గురువారం వినతి పత్రం అందించారు. ఈవోఆర్డీ సంజన్న, పరిపాలన అధికారి సురేష్ ఉన్నారు.

అధికారులతో ప్రజల వాగ్వాదం

పాములపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో అండర్ పాస్ బ్రిడ్జి వద్దంటూ నేషనల్ హైవే పీడీ పద్మతో గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. గురువారం పీడీ గ్రామస్థులతో చర్చించారు. గ్రామస్థులు, మహిళలు మాట్లాడుతూ అండర్‌పాస్ బ్రిడ్జి గ్రామంలో నిర్మించడం వల్ల బస్సులు గ్రామం వెలపల ఆపుతాయని, దీంతో రాత్రి వేళల్లో మహిళలు, వృద్ధులు ఇళ్లకు చేరుకోవాలంటే ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుందని వాపోయారు. గత రెండు రోజులుగా గ్రామంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అయితే గ్రామంలో కొంతమంది అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని, మరి కొంతమంది వద్దని చెబుతుండటంతో అధికారులు అయోమయ స్థితిలో ఉన్నారు. ఎస్ఐ సురేశ్‌కుమార్, హైవే అధికారులు ఉన్నారు.

ఆట వస్తువుల పంపిణీ

మిడుతూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తువ్వా పెద్ద మల్లారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తువ్వా అయ్యపు రెడ్డి గురువారం క్రీడాకారులకు ఆట దుస్తులు, ఆట వస్తువులు, పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు అందజేశారు. హెచ్ఎం సాయి తిమ్మయ్య, ఉపాధ్యాయులు అయ్యపు రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

సెవెన్ హిల్స్ ఆసుపత్రిపై విచారణ

నంద్యాల హాస్పిటల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిపై గురువారం విచారణ కమిటీ సభ్యులు విచారణ ప్రారంభించారు. బాధితురాలు బేబీ శాంతి, ఫిర్యాదుదారుడు సతీష్‌కుమార్‌ను పిలిపించి ఘటనకు సంబంధించిన విషయాలను సేకరించారు. గంటల వ్యవధిలో టెస్ట్‌లు, స్కానింగ్‌ల పేరుతో అధిక డబ్బులు వసూలు చేశారన్న ఫిర్యాదుతో విచారణ అధికారులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ భరత్‌కుమార్‌విచారణ చేపట్టి ఆసుపత్రి రికార్డులు, పేషెండ్, ఫిర్యాదుదారుని రికార్డులు పరిశీలించారు. ఇదే సంఘటనపై ప్రభుత్వాసుపత్రిలో విచారణ చేయాల్సి ఉండగా వాయిదా వేశారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

శ్రీశైలం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో గురువారం పౌర్ణమి ఘడియలు రావడంతో గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని దేవస్థానం ఘనంగా నిర్వహించింది. సాయంత్రం స్వామి, అమ్మవార్ల మహా మంగళ హారతుల అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● శ్రీశైల మహాక్షేత్రంలో పౌర్ణమి ఘడియలను పురస్కరించుకొని సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు వారి గోత్రనామాలతో లక్షకుంకుమార్చనలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్ష సేవ ద్వారా అవకాశం కల్పించింది. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్ర నామాలతో ఆయా ఆర్జిత సేవలలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ ద్వారా రూ. 1,116 సేవా రుసుమును చెల్లించి పరోక్ష సేవలో పాల్గొనవచ్చును. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో ఎం.శ్రీనివాసరావు సూచించారు.

● శ్రీశైల క్షేత్రంలో లోక కల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ, పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

● శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను గురువారం రాత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్ అండ్ బీ, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఐఏఎస్ దర్శించుకున్నారు. ముందుగా ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కాంతిలాల్ దండేకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి: కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి తిరిగి గృహనిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం కల్పించే అదనపు ఆర్థికసహాయం గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎస్ఐసీ వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుంచి హౌసింగ్ ఇంజనీర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమెనిటీ సెక్రటరీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15నుంచి 23వరకు ప్రతి లబ్ధిదారుడి ఇంటికివెళ్లి గృహనిర్మాణ అదనపు ఆర్థిక సహాయంపై వివరించాలన్నారు. సర్వే సిబ్బంది సంబంధిత లాగిన్‌లో వివరాలు పొందుపరచి లబ్ధిదారులతో జియోట్యాగింగ్‌చేసి అప్‌లోడ్ చేయాలని చెప్పారు.

మహిళల భద్రత కోసమే 'శక్తి' యాప్

ఆత్మకూరురూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు ,చిన్నారుల భద్రత రక్షణ కోసమే పోలీస్ శాఖ శక్తియాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చిందని ఆ యాప్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పి రామాంజినాయక్ పేర్కొన్నారు. గురువారం వడ్లరామాపురం గ్రామంలో సీఐ రాము ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించి గ్రామస్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'రామచిలుక రూపాన్ని దహనం చేయడం సరికాదు'

శ్రీశైలం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో బుధవారం సాయంత్రం జరిగిన కామదహనంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పక్షి రామచిలుక రూపాన్ని దహనం చేయడం సరికాదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంతిరెడ్డి అరవిందరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కామదహనం చేసే విధానం ఎక్కడైనా చూసినా, ఏ శాస్త్రంలోనైనా రామచిలుక అనే పదము ఉన్నట్లయితే ఆ శాస్త్రాన్ని తప్పనిసరి సంబంధిత వేద శాస్త్రపండితులు, సంబంధిత అధికారులు చూపించాల్సి ఉంటుందని అన్నారు. కాముని దహనం చేయాలి గానీ వాహనమైన రామచిలుక రూపాన్ని దహనం చేయడం సరికాదని అన్నారు. చర్యలు తీసుకోవాలని దేవస్థానం ఉన్నతాధికారులకు, దేవాదాయశాఖ కమిషనర్‌కు లేఖ పంపినట్లు ఆయన తెలిపారు.

'సారా తయారు చేస్తే చర్యలు'

పాణ్యం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎక్సైజ్ డీఎస్పీ రాముడు హెచ్చరించారు. గురువారం పాణ్యం ఇందిరానగర్‌లో సర్పంచ్ పల్లవి ఆధ్వర్యంలో నవోదయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐలు బ్రహ్మయ్య, అఖిల, ఏఎస్ఐ నరసింహులు, వీఆర్వో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, మాజీ జడ్పీటీసీ నారాయణమ్మ, చెంచులు పాల్గొన్నారు.

మిడుతూరు: నాటు సారాను నిర్మూలించి భవిషత్తు తరాలకు బాట వేద్దామని ఎస్ఎండీ జఫ్రుల్లారుల్లా అన్నారు. మండలంలోని నాగలూటి గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో గురువారం గ్రామ సర్పంచ్ ఉషారాణి అధ్యక్షతన, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటు సార నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసి నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. అడాప్షన్ అధికారి శివన్న, మండల ఉపాధ్యక్షుడు నబీరసూల్, పంచాయతీ సెక్రటరీ పవన్ కుమార్, వీఆసెకవ సుందర రాజు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ డే

నంద్యాల హాస్పిటల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గురువారం ల్యాబ్ టెక్నీషియన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా ల్యాబ్ టెక్నీషియన్స్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ కార్యాలయంలో కేకును కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఉద్యోగంలో చేరి ఎలాంటి పదోన్నతులు లేకుండా అదే ఉద్యోగిగానే రిటైర్‌మెంట్ పొందుతున్న ఏకైక ఉద్యోగి ల్యాబ్ టెక్నీషియన్, పదోన్నతులు కల్పించాలని నందికొట్కూరు ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ కార్యదర్శి, ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. గురువారం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్స్ డే సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్లు కేక్ కట్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ

నంద్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ప్రభాత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసి విద్యార్థులు దాదాపు 120 మంది, పార్నపల్లి సంయుక్తంగా రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ నిబంధనలపై పట్టణంలో ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ ఉపయోగించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి అంటూ నినాదాలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఉపయోగించడం వంటి ఉల్లంఘనలకు పెరిగిన జరిమానాలతో కూడిన ప్రతులను ప్రజలకు పంపిణీ చేశారు.

18న జాబ్ మేళా

ఆత్మకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. గురువారం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. 18న నిర్వహించే జాబ్‌మేళాకు ఐదు ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పదోవ తరగతి, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 6303244165, 76739023328 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ఆత్మకూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మనగ్రోమోర్ సంస్థ సహకారంతో రూ.2.75లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం ప్లాంట్‌ను సంస్థ జోనల్ మేనేజర్ దామోదర్ నాయుడు, మార్కెటింగ్ మేనేజర్ కిశోర్, జోనల్ హెచ్ఆర్ మహేష్, విశ్వనాథ్ ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, సంస్థ ప్రతినిధులు సుబ్బారెడ్డి, గిరికుమార్, మహబూబ్‌బాషా ఉన్నారు.

'విజయవంతం చేయండి'

గడివేముల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడాలో శుక్రవారం నిర్వహించే జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పాణ్యం నియోజకవర్గ నాయకుడు ధరణి చంద్రమోహన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనసే పార్టీ 12వ ఆవిర్భావ సభకు పార్టీ శ్రేణులు, పవన్‌కల్యాణ్ అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు.

'ప్రజలకు అందుబాటులో ఉండాలి'


శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మాండ్ర శివానందరెడ్డి


నందికొట్కూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సూచించారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ ముఖద్వారాన్ని, ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం 26వ వార్డు కౌన్సిలర్ మందాడి వాణి ఆధ్వర్యంలో ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు జాకీర్, భాస్కర్‌రెడ్డి, ధర్మారెడ్డి, చిన్నరాజు, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, వీరం ప్రసాద్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, సురేంద్ర, శ్రీనివాసులు, రమేష్, మున్సిపల్ కమిషనర్ బేబి పాల్గొన్నారు.

నా భర్త మృతికి కంపెనీదే బాధ్యత

● పోలీసులకు మహిళ ఫిర్యాదు

నందికొట్కూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తన భర్త మృతికి కేఎల్ఎస్ఆర్ కంపెనీదే బాధ్యత అని, ఓర్వకల్లు పరిశ్రమల హబ్‌కు నీటి పైప్ లైన్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన గొల్ల జయమ్మ కోరారు. బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. వివరాలివీ... బ్రాహ్మణకొట్కూరుకు చెందిన గొల్ల చిన్న శేషన్న అదే గ్రామంలో ఎలక్ట్రికల్ షాపును నిర్వహిస్తుండేవారు. ఈనెల 11వ తేదీన పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో పైపులైన్ కోసం తీసిన గొయ్యిలో ప్రమాదవశాత్తు పడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. అయితే 12వ తేదీ రాత్రి తలలో నొప్పి వస్తుందని చెప్పడంతో తిరిగి ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక చిన్న శేషన్న మృతి చెందారు. పనుల నేపథ్యంలో అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, పర్యవేక్షణ లోపంతో తన భర్త ప్రమాదానికి గురై మృతి చెందారని జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పైన, కేఎల్ఎస్ఆర్ కంపెనీకి చెందిన ఏఈ రాజేష్‌పై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు.

పెనాల్టీ కేసులను పరిష్కరించాలి: డీఆర్వో


మాట్లాడుతున్న డీఆర్వో రామునాయక్

నంద్యాల నూనెపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం-2005కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పెనాల్టీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఆర్వో రామునాయక్ వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సమాచారహక్కు చట్టం-2005పై జిల్లా అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో 4(1)బి రిజిస్టర్‌తోపాటు రిజిస్టర్ 1, 2తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. సెక్షన్ 2సీ కింద ప్రజాప్రయోజనాలకు సంబంధించి ఏవైనా దరఖాస్తులు అడిగినపుడు సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రవికుమార్, సీ- సెక్షన్ సూపరింటెండెంట్ శుభకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

ధర్మవరం సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం విజయవాడలోని సీడ్స్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సీడ్స్ ఇంజనీరింగ్ యాక్టివిటీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సీడ్స్ ఫీల్డ్ సూపర్‌వైజర్లు ఫీల్డ్ ఆఫీసర్లను ఉద్దేశించి సుబ్బారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఫీల్డ్ సూపర్‌వైజర్లు, ఫీల్డ్ ఆపరేటర్లను ఉద్దేశించి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా భవిష్యత్తులో వారు పండించిన దిగుబడులు సాధించేలా శ్రమించాలని అన్నారు.

వైసీపీపై ధ్వజమెత్తిన మంత్రి బీసీ

బనగానపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీ పోర్టు సెజ్‌ల వాటాల లావాదేవీలపై జరిగిన చర్చలో రోడ్లు భవనాల శాఖా మంత్రి శాసన మండలిలో గురువారం సమాధానమిచ్చారు. మంత్రి బీసీ శాసన మండలిలో మాట్లాడుతూ కాకినాడ సీపోర్టు - కాకినాడ సెజ్‌లలో వాటా లు ఎవరు కొన్నారో, ఎవరు లబ్ధి పొందారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. నేడు కోర్టుల్లో కేసులు వైసీపీ నాయకులపై ఎందుకు నడుస్తున్నాయో వారే చెప్పాలని అన్నారు. అరబిందో పేరు మీద వాటాలు ఎవరు రాయించుకున్నారో తెలియకుండా సభలో ప్రతిపక్ష సభ్యులైన వైసీపీ సభ్యులు మాట్లాడితే ఎలా అని మంత్రి వైసీపీ శాసనమండలి సభ్యులను నిలదీశారు. వైసీపీ వారు అక్రమాలకు పాల్పడి ప్రభుత్వంపై అసత్యాలతో విమర్శలు చేయడం సమంజసం కాదని మంత్రి హితవు పలికారు.



శాసన మండలిలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

● ఎమ్మెల్సీగా ఎన్నికైన బీటీ నాయుడును రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం సత్కరించారు. తాడేపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఎమ్మెల్సీ సత్కరించారు.

స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని విజయవంతం చేయాలి

బనగానపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని ఎంపీడీవో రమణ, తహసీల్దారు నారాయణ రెడ్డి అన్నారు. గురువారం బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో తహసీల్దారు, ఎంపీ డీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల విధి విధానాలు, మార్గదర్శకాలు గురించి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాధికారి స్వరూప, ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, ఏపీఓ రేష్మా, ఏపీఎం శ్రీనివాసులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

మూగ జీవాల దాహార్తి తీర్చాలి

బనగానపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నోరులేని మూగ జీవాలకు దాహార్తిని తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. గురువారం బనగానపల్లె మండలం చెర్వుపల్లె ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వేసవిలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పక్షులు, జంతువులకు దాహార్తి తీర్చే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద నీటి తొట్టెలు, ఇంటిపై పక్షులకు నీటిని ఏర్పాటు చేయాలని కోరారు. హెచ్ఎం నౌసిద్ బేగం మాట్లాడారు. కార్యక్రమంలో సుధాకర్ గౌడ్, చెర్వుపల్లె శ్రీను, భాష విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటపాడులో ఉపాధి పనులపై గ్రామ సభ

కొలిమిగుండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామంలో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ బృందం సభ్యులు గురువారం గ్రామ సభ నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి, క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. అనంతరం గ్రామ సభలో వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మూల శివారెడ్డి, ఎం.వి శివరామిరెడ్డి, గ్రామ సర్పంచ్ సుంకమ్మ, పంచాయతీ కార్యదర్శి అమరావతి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

బనగానపల్లె, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులకు బనగానపల్లె కస్తూర్బా పాఠశాలలో క్రీడా దుస్తులు టీడీపీ నాయకులు గురువారం పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు పాతపాడుకు చెందిన సంగు శంఖేశ్వరరెడ్డి, మీరాపురానికి చెందిన బత్తుల నారాయణరెడ్డి సొంత నిధులతో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ ప్రోత్సాహంతో తమ వంతుగా క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కబడ్డీ కోచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన టీడీపీ నాయకులను సత్కరించారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

చాగలమర్రి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిపై భవనాశిలో గురువారం తెల్లవారుజామున కారు బోల్తాపడింది. ఈ సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. బనగానపల్లెకు చెందిన రాజారెడ్డి, హర్ష తీవ్రంగా గాయపడగా పవన్, సాయి గణేష్‌లు స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న టోల్‌ప్లాజా అంబులెన్స్ గాయపడ్డ వారిని ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదకర ప్రయాణం



ఆటో టాప్‌పై ఎక్కిన మహిళా కూలీలు



ట్రాలీ వాహనంలో వెనకాల డోర్ తీసి కూర్చున్న కూలీలు

కొలిమిగుండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నిత్యం ఎదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా కూలీల తీరు మారడం లేదు. అవగాహన లేమి, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మహిళా కూలీల ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఏమాత్రం అదుపు తప్పినా అంతే గతి అన్న రీతిలో ప్రయాణం సాగుతోంది. ఆటోలో 30 మంది కూలీలను ఎక్కిస్తున్నారు. మండలంలో మీర్జాపురం, కొలిమిగుండ్ల, పేట్నీకోట, అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె తదితర గ్రామాల నుంచి ప్రతి రోజూ సుమారు 1500 మందికి పైగా మహిళా కూలీలు కూళి పనుల కోసం అనంతపురం జిల్లా తాడిపత్రి, యాడికి మండలాలకు తరలి వెళుతున్నారు. అలాగే సంజామల, కోవెలకుంట్ల మండలాలకు కూడా వెళుతున్నారు. అయితే కూలీలు ఆటోల్లో ఓవర్ లోడుతో ప్రయాణం సాగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. కూలీలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



ఆటోలో లోపల పైనా ఎక్కి పోతున్న కూలీలు

లైంగిక నేరాలపై అవగాహన



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): లైంగిక నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి అన్నారు. గురువారం స్థానిక పట్టణంలోని జిల్లా పరిషత్ పాతపేట హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్జి తంగమణితోపాటు అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం జడ్జి తంగమణి విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీకాంతరెడ్డి, సుబ్బారెడ్డి, దేవేంద్ర, విజయకుమార్, లక్ష్మయ్య, రాధ, వెంకటలక్ష్మి, అనంత శ్రీనివాసులు, శివప్రసాద్, రఘునాథ్, ఎస్తేరమ్మ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

కొలిమిగుండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. గత ప్రభుత్వ హయాంలో పది పరీక్షల్లో నెలకొన్న లీకేజీ వివాదం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఇంటర్ పరీక్షలను అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించింది. మార్చి 1న ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ముగిశాయి. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 15న ముగియనున్నాయి. చివరి రోజు గురువారం 191 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావల్సి ఉండగా 182 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల ముఖ్య అధికారి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తొమ్మిది మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

కొలిమిగుండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపురం గ్రామంలో కొద్ది రోజులుగా తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో టీడీపీ నాయకులు గురువారం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. మంత్రి బీసీ జనార్దనరెడ్డి ఆదేశాల మేరకు ట్యాంకర్‌తో తాగునీటిని అందిస్తున్నామని టీడీపీ మండల యువ నాయకులు అంబటి వివేకానందరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాదు, కాంచాని మల్లేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు అదనపు సహాయం

కొలిమిగుండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిపోయిన గృహ నిర్మాణాల లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు పరిహారం ప్రకటించినట్లు కొలిమిగుండ్ల ఎంపీడీవో ప్రసాదరెడ్డి వెల్లడించారు. గృహ నిర్మాణా శాఖ సిబ్బందితో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. మండలంలో బీసీ లబ్ధిదారులకు సంబంధించి 412, ఎస్సీ లబ్ధిదారులు 389, ఎస్టీ లబ్ధిదారులు 35 మంది ఉన్నట్లు ఆయన వెల్లడించారు. బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు అదనపు పరిహారం రూ.50 వేలు, ఎస్టీ వారికి రూ.75 వేలు ప్రభుత్వం అదిస్తుందని అన్నారు.

● **చాగలమర్రి:** పక్కా గృహాల లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం చాగలమర్రి కస్తూర్బా పాఠశాల సమీపంలో పక్కా గృహాల లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నరసింహారావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఓబులేసు ఉన్నారు.

ఉయ్యాలవాడ: ఆయా దశల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సహాయం అందిస్తున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ నరసింహారావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎస్సీ, బీసీ గృహ నిర్మాణ లబ్దిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ. 75వేలు, పీవీటీజీ లబ్ధిదారులకు రూ.లక్ష అందిస్తుందని తెలిపారు. వెంటనే నిలిచిపోయిన గృహ నిర్మాణాలను ప్రారంభించాలని వారు కోరారు.

మా పొలాన్ని ఆన్‌లైన్ చేసుకున్నారు



తహసీల్దారు కార్యాలయం వద్ద మహబూబ్‌బాషా కుటుంబ సభ్యులు

ప్యాపిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పొలాన్ని దౌర్జన్యంగా ఆన్‌లైన్ చేయించుకున్నారని మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. గురువారం బాధిత కుటుంబం తమకు న్యాయం చేయాలని తహసీల్దారుకు వినతి పత్రం అందజేసింది. మహబూబ్ బాషాకు మునిమడుగు గ్రామంలో 108-3 సర్వే నెంబరులో 4.30 ఎకరాల పొలం ఉంది. దాదాపు 15 ఏళ్లుగా ఈ పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన పిక్కిలి రామాంజినేయులు అనే వ్యక్తి తన పేరు మీద, భార్య మహేశ్వరమ్మ పేరు మీద మహబూబ్‌బాషా పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. పదేళ్ల క్రితం రామాంజినేయులు చనిపోయాడు. అయితే ప్రస్తుతం కుటుంబ సభ్యులు పొలం తమ పేరుమీద ఉందంటూ తమపై దౌర్జన్యం చేస్తున్నారని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. అధికారులు పొలం పత్రాలు పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరుతోంది. తహసీల్దారు భారతిని వివరణ కోరగా విచారణ చేసి న్యాయం చేస్తామని తెలిపారు.

వైసీపీ నాయకుడిపై టీడీపీ శ్రేణుల దాడి

కోవెలకుంట్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల మండలంలోని కంపమల్ల గ్రామంలో వైసీపీ నేత సోముల లోకేష్‌రెడ్డిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. బుధవారం రాత్రి కొందరు టీడీపీ కార్యకర్తలు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతని తమ్ముడు వెంకటేశ్వరరెడ్డి, తండ్రి వెంకటరామిరెడ్డికి సైతం గాయాలయ్యాయి. లోకేష్‌రెడ్డి అండతో బుధవారం సాయంత్రం వైసీపీ నాయకుడు, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి కేసీ కెనాల్ నీటి విడుదలకు సంబంధించిన విషయంలో టీడీపీ నాయకులను దూషించినట్టు తెలుస్తోంది. దీంతో భరించలేని టీడీపీ శ్రేణులు ఈవిషయంపై అడగడానికి సుధాకరరెడ్డి, లోకేష్‌రెడ్డి ఇళ్ల వద్దకు వెళ్లిన నేపథ్యంలో ఈ ఘర్షణ తలెత్తినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. తీవ్రంగా గాయపడిన లోకేష్‌రెడ్డిని పోలీసులు కోవెలకుంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. తొమ్మిది మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ వెల్లడించారు. సూర చిన్న సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, కోదండ రామిరెడ్డి, మోహన్, సుభాన్, ఆర్.చిన్న సుబ్బారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డిలపై సోముల వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ హనుమంతునాయక్ తెలిపారు.

జాబ్ మేళాలో 38 మందికి ఉద్యోగాలు

కొలిమిగుండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్వీబీ ప్రభుత్వ డీగ్రీ కళాశాల లో గురువారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో 38మంది ఉద్యోగాలు లభించాయి. నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 60మంది నిరుద్యోగులు హాజరు కాగా 38 మందికి ఉద్యోగాలు లభించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు బాస్కరరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫారం పాండ్ లక్ష్యాలను అధిగమించాలి

చాగలమర్రి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఫారం పాండ్ లక్ష్యాలను అధిగమించాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 5 ఎకరాల్లో లోపు ఉన్న రైతులు అర్హులని అన్నారు. వర్షపు నీరు నిల్వ చేసుకునేందుకు రైతులు తమ పొలాల వద్ద ఫారం పాడ్‌లు తవ్వుకోవాలని సూచించారు. ప్రస్తుతం 2,200 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి

● జిల్లా బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ అధికారి కే లక్ష్మీదేవి

డోన్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి కే.లక్ష్మీదేవి ఆకాంక్షించారు. గురువారం రాత్రి పట్టణంలోని బీసీ బాలుర సంక్షేమ హాస్టల్‌ను ఆమె సందర్శించారు. హాస్టల్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పరీక్షలంటే భయం విడనాడాలన్నారు. ప్రశాంతంగా పరీక్షలకు హాజరై చదువులో మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, హాస్టల్‌కు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ హాస్టల్ వార్డెన్ మధు, సిబ్బంది ఉన్నారు.

ప్రయాణికుల జీవితాలతో చెలగాటం

బేతంచెర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే కాంట్రాక్టర్ ప్రయాణికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని గోరుమానుకొండ తండా ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నేషనల్ హైవే రోడ్డును పరిశీలించారు. రహదారి పనులు నిదానంగా సాగుతుండడంతో ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాల పాలవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రవీంద్రనాయక్, నాగేశ్వరరావు నాయక్ స్వామి, గౌతమి నాయక్, వెంకటేశ్ నాయక్, శంకర్ నాయక్ రాముడు నాయక్ శ్రీను, దేవ తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు సరి చూసుకోండి

బేతంచెర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పంటల వివరాల నమోదు సరి చూసుకోవాలని ఏవో కిరణ్ కుమార్ అన్నారు. రబీ సీజన్‌లో నమోదైన పంట వివరాలను ప్రతి రైతు సేవా కేంద్రంలో ఉంచామని తెలిపారు. అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్ర సిబ్బందికి తెలియజేస్తే వెంటనే సరి చేస్తారన్నారు. గోరుమానుకొండ అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేష్, గూటుపల్లి హార్టికల్చర్ అసిస్టెంట్ రాజ నాయక్, రంగాపురం అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి, వైష్ణవి రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు జాబితాను ప్రదర్శించి రైతులకు తెలియజేశారు.

సమస్యలు పట్టని అధికారులు

డోన్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డుల్లో సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకోవడం లేదని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆటోనగర్‌లోని 28వ వార్డులో ప్రజా చైతన్య పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నక్కి శ్రీకాంత్ మాట్లాడుతూ సరైన డ్రైనేజీ కాలువలు, సిమెంటు రోడ్లు లేనందుకు అయా వార్డుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపాలిటీ ఏర్పాటై 20 సంవత్సరాలవుతున్నా పలు వార్డులు అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణమన్నారు. వీటిపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పెద్దఎత్తున మున్సిపల్ కార్యాలయం ముట్టడించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు శివరాం, అక్బర్ బాషా, నక్కి హరి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

డోన్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కేఈ కృష్ణమూర్తినగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. గురువారం కాలనీవాసి మాధవస్వామి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం వద్దకు వెళ్లి కమిషనర్ ప్రసాద్‌గౌడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవస్వామి మాట్లాడుతూ సిమెంటు రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. కమిషనర్ స్పందిస్తూ కేఈ కృష్ణమూర్తినగర్‌ను సందర్శించి అభివృద్ధి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మున్సిపల్ వేలాలు వాయిదా

డోన్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం జరగాల్సిన మున్సిపల్ వేలాలు వాయిదా పడినట్లు కమిషనర్ ప్రసాద్ గౌడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ టెండరుదారులు ఒక్కరే హాజరు కావడంతో వాటిని మరలా వాయిదా వేసినట్లు వెల్లడించారు. వారపు సంత, జంతు వధ శాల వసూళ్ల తదితర టెండర్లు వాయిదా వేశామన్నారు. మళ్లీ వాయిదా టెండరు తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఆరీఫ్, ఆర్వో వెంకటరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.9 కోట్లు మంజూరు

డోన్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వార్డులకు సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, సీసీ కల్వర్టులు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్స్ మరమ్మతులకు రూ.9 కోట్లు మంజూరైనట్లు మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఆటోనగర్, శ్రీనివాస నగర్, త్రివర్ణ కాలనీ, కేవీఎస్ కాలనీ, పాతపేట, టీచర్స్ కాలనీ, శ్రీరామ్‌నగర్, వైఎస్ నగర్, టీఆర్ నగర్, సుజాతమ్మ నగర్ కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాయపల్లెలో ఈ నెల 9న పొలం విషయంలో ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు గురువారం వెల్లడించారు. సర్వే నెంబరు 144-1లో మూడు ఎకరాల పొలం విషయంలో భూమి తమదేనంటూ చింతలాయపల్లెకు చెందిన దూదేకుల ఇమాంబి కుటుంబ సభ్యులు, అంకిరెడ్డిపల్లెకు చెందిన బత్తుల వరలక్ష్మి కుటుంబ సభ్యులు ఘర్షణ పడ్డారని, ఆయా వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని నంద్యాల, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల జోనల్ మలేరియా అధికారి లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. గురువారం చాగలమర్రి 24 గంటల ప్రభుత్వ వైద్యశాలను గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు.

రెండు కేంద్రాల్లో పది పరీక్షలు

రుద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండలంలో రెండు కేంద్రాల్లో పది పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వీర రాఘవయ్య గురువారం తెలిపారు. రుద్రవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నరసా పురం థామస్ మార్తోమా ఇంగ్లీషు మీడియం హైస్కూలులో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రుద్రవరంలో 225 మంది, నరసాపురంలో 176 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షలు నిర్వహించడానికి చీఫ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా రుద్రవరంలో కె.అనురాధ, బాలగురప్ప, నరసాపురంలో సుబ్బరాయుడు, వెంకటరమణ లను ప్రభుత్వం నియమించిందన్నారు.

టైలరు శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రుద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం మండల పరిధిలో టైలరు శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి గురువారం తెలిపారు. కమ్మ, కాపు, క్షత్రియ, ఆర్యవైశ్య బ్రాహ్మణ, రెడ్డి, బీసీ, ఈబీసీ కులాలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి టైలరింగ్‌పై శిక్షణ ఇస్తామని అన్నారు.

17 నుంచి దరఖాస్తులు

రుద్రవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఈ నెల 17 నుంచి దరఖాస్తులు స్వీకరించబడతాయని ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు గురువారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు 160 సీట్లు ఉన్నాయని అన్నారు. అలాగే 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మే 22 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నీటి సమస్య పరిష్కరించాలి

చాగలమర్రి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ చాగలమర్రి గ్రామంలో పారిశుధ్యం, మంచి నీటి సమస్య, రహదారుల సమస్య పరిష్కరించాలని టీడీపీ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కలిసి గురువారం ఈవో తాహిర్‌హుసేన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో కుక్కలు, కోతుల బెడద అధికంగా ఉందని, రోడ్లు, మురుగు కాలువల పనులు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టైలర్ బాష, ఓబులేసు, వెంకటయ్య, బషీర్, అబ్దుల్లా, గాంధీ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దస్తగిరి స్వామి ఉరుసు

చాగలమర్రి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామంలో గురువారం దస్తగిరిస్వామి ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి దస్తగిరిస్వామికి ఫాతెహాలు చేశారు. దస్తగిరిస్వామి జెండాను కమిటీ సభ్యులు పురవీధుల గుండా గ్రామోత్సవం చేసి అనంతరం దర్గాలో కొలువుదీరింప చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి పర్యవేక్షణలో ఉయ్యాలవాడ ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఏఎస్ఐ నబీసాహెబ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవో న్యామతుల్ల తెలిపారు. గురువారం గుంతపాలెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని సూచించారు. ఎఫ్ఏ-4 సంబంధించిన సమాధాన పత్రములు, ఆరోగ్యశాఖ ద్వార ఏబీహెచ్ఏ ఐడీ కార్డులను పరిశీలించారు. విద్యార్థులలో గ్రేడింగ్ పెంచాలని అన్నారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు



పెద్దవంగలిలో రాతిదూలం పోటీలను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యుడు

చాగలమర్రి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరిస్వామి ఉరుసు సందర్భంగా గురువారం రాతిదూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలను దర్గా కమిటీ సభ్యులు రబాని ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వృషభరాజములు పాల్గొన్నాయి. ఈ పోటీలో మొదటి స్థానంలో నాగర్ కర్నూలు జిల్లా రాయవరానికి చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు, రెండో స్థానంలో రాయవరానికి చెందిన ధనూష్‌రెడ్డి వృషభాలు, మూడవ స్థానం కడప జిల్లా నాగయ్యపల్లెకు చెందిన వర్షనిరెడ్డి వృషభాలు నిలిచాయి. యజమానులకు నగదు బహుమతులను దాతలు అందజేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఉయ్యాలవాడ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఉన్న 285 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామిక వేత్త, గోవిందపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు చామల చంద్రశేఖర్‌రెడ్డి పరీక్షా సామగ్రి అందించారు. గురువారం మండలంలోని ఆదర్శ, కస్తూరిబా బాలికల పాఠశాలలతో పాటు మాయలూరు, హరివ రం, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు, కొండుపల్లె గ్రామాల ఉన్నత పాఠశా లలు తిరిగి టీడీపీ మండల నాయకుడు బోరెడ్డి నర్శిరెడ్డితో కలిసి విద్యార్థులకు అట్ట, జామెంట్రీ బాక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. పది పబ్లిక్ పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచే విద్యార్థికి రూ.10 వేలు నగదు బహుమతి అందిస్తానని దాత చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో మాయలూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షరీఫ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు భరత్‌రెడ్డి, బాషా, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అసెంబ్లీలో గుండ్రేవుల..

గుండ్రేవుల జలాశయంపై శాసనసభలో గురువారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత గళమెత్తారు. తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించి కేసీ కాలువ ఆయకట్టు రైతులను ఆదుకోవాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉందని అన్నారు. ఈ సందర్భంగా గుండ్రేవుల ప్రాజెక్టు చేపట్టి కేసీ రైతులను, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం ప్రజలను ఆదుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అసెంబ్లీ సాక్షిగా స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గుండ్రేవుల గురించిన వివరాలు ఇలా..



తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టుకు ప్రతిపాదిత ప్రదేశం

కర్నూలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో కర్నూలు-కడప (కేసీ) కాలువ కింద 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కేడబ్ల్యూడీటీ-1 (బచావత్ అవార్డు) మేరకు 31.90 టీఎంసీల నీటివాటా ఉన్నా.. కేసీ కాలువ ఆయకట్టు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు. వేసవిలో కర్నూలు నగర ప్రజలు తీవ్ర తాగునీటి ఎద్దడితో తల్లడిల్లాల్సి వస్తుంది. సుంకేసుల బ్యారేజీ ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మిస్తే.. కేసీ ఆయకట్టుకు సాగు, కర్నూలు నగరానికి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఈఈ సుబ్బరాయుడు విజ్ఞప్తి మేరకు ఉమ్మడి ఏపీ చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వేకు రూ.54.95 లక్షలు నిధులు ఇచ్చారు. ఆర్వే అసోసియేట్స్ సంస్థ సర్వే చేసి రూ.2,890 కోట్లతో ప్రభుత్వానికి డీపీఆర్ ఇచ్చింది. 2019 ఫిబ్రవరి 21న నాటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లు మంజూరు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు ఒక్కపైసా కూడా నిధులు ఇవ్వకపోగా.. అంతర్ రాష్ట్ర సమస్య అంటూ పెండింగ్ ఫైళ్ల జాబితాలో పడేసింది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత విన్నపం మేరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు 802వ ప్రశ్నగా అవకాశం ఇవ్వడంతో ఆమె గుండ్రేవుల గురించి మాట్లాడారు.

- **ప్రాజెక్టు ప్రాధాన్యతపై మాట్లాడిన ఎమ్మెల్యే గౌరు చరిత**
- **సీఈ కబీర్‌బాషాతో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ సమీక్ష**



అసెంబ్లీలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కరువు రైతుల జీవనాడి గుండ్రేవులు

గుండ్రేవుల ప్రాజెక్టు కరువు సీమ రైతుల జీవనాడి అని శాసనసభలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. కేసీ కాలువ కింద 2.65 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉందని, తుంగభద్ర డ్యాం నుంచి సక్రమంగా నీరు అందడం లేదన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తీసుకుందామంటే కేఆర్‌ఎంబీలో తెలంగాణ అభ్యంతరం చెబుతుందని వివరించారు. 2019లో నాటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లతో తుంగభద్రపై గుండ్రేవుల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చి టెండర్లు కూడా పిలిస్తే.. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్లు అంటూ రద్దు చేసిందని, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో చేరుస్తామని చెప్పి ఐదేళ్లలో ఒక్కపైసా కూడా ఇవ్వకుండా తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

గుండ్రేవుల చేపడుతాం.. కేసీని ఆదుకుంటాం

గుండ్రేవుల ప్రాజెక్టును చేపట్టి కేసీ రైతులు, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని ఆదుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎమ్మెల్యే గౌరు చరిత ప్రశ్నకు సమాధానంగా స్పష్టం చేశారు. సుంకేసులు ఎగువన గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మిస్తే.. వెనుకబడిని రాయలసీమ ప్రాంతానికి ప్రయోజనం కల్పించాలని గుండ్రేవులకు అంకుర్పారణ చేశారు. 2013లో డీపీఆర్ తయారు చేయమని రూ.54.95 లక్షలు ప్రభుత్వం సర్వేకి నిధులు ఇచ్చింది. సర్వే చేసిన ఆర్వే అసోసియేట్స్ సంస్థ డీపీఆర్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కర్నూలు జిల్లాలో 11 గ్రామాలు, తెలంగాణలో 5 గ్రామాలు ముంపుకు గురవుతున్నాయి. రాష్ట్రం విడిపోవడంతో తెలంగాణ రాష్ట్రం సమ్మతి కూడా అవసరం ఉంది. 2019లో కేఆర్‌ఎంబీ ద్వారా తెలంగాణ సమ్మతి తీసుకొని ప్రాజెక్టు కట్టాలని నాటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లు ఇచ్చారు. దురదృష్టం కొద్ది జగన్ ప్రభుత్వం రావడంతో ఐదేళ్లలో ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదు. తెలంగాణ అనుమతి కోసం కేఆర్‌ఎంబీకి లేఖలు రాలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో రాయలసీమ ప్రాజెక్టులకు వెచ్చించిన బడ్జెట్ రూ.12 వేలు కోట్లు కాగా సీమ బిడ్డ అని చెప్పుకునే జగన్ ఐదేళ్లలో పెట్టిన బడ్జెట్ రూ.3,500 కోట్లే. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచనల మేరకు గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి రూ.4,530 కోట్లు అవసరమని అంచనాలే వేశామని, విడతల వారిగా నిధులు ఇచ్చి చేపడుతామని మంత్రి నిమ్మల రామానాయుడు అసెంబ్లీలో హామీ ఇచ్చారు. అనంతరం జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ ప్రాజెక్టుపై ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్‌లతో సమీక్షించారు.

హంద్రీలో పచ్చదనం..!

- చెత్తతో నదిని పూడ్చేసిన నగర పాలక సంస్థ
- కబ్జాకు అక్రమార్కుల ఎత్తులు
- మంత్రి టీజీ భరత్ ఆగ్రహం
- పూడ్చిన నదిలో పచ్చదనం కోసం సన్నాహాలు



హంద్రీ నదిని చెత్తతో పూడ్చేసిన నగరపాలక సంస్థ సిబ్బంది

కర్నూలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగర నడిబొడ్డున హంద్రీ పరివాహక ప్రాంతంలో ఆనంద్ థియేటర్ వద్ద చెత్తతో పూడ్చివేసిన చోట కేఎంసీ అధికారులు పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి కలెక్టరేట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళ్లే ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా ఆనంద్ థియేటర్‌కు ఎదురుగా నదిపై కాజ్‌వే (వంతెన) ఉంది. దాని పక్కనే హంద్రీ ఒడ్డున కేఈ మాదన్న నగర్ కాలనీ ఉంది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) అధికారుల ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది నగరంలో సేకరించిన చెత్త, మట్టిని కాజ్‌వే పక్కనే వేస్తూ.. నదిని పూడ్చేస్తూ వచ్చారు. దీనిపై గతంలోనే జలవనరుల శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా.. నగరపాలక పారిశుధ్య సిబ్బందిలో మార్పు రాలేదు. అయితే.. కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది చెత్త, మట్టితో పూడ్చేసిన హంద్రీ నదిని కబ్జాకు కొందరు ప్రయత్నించారు. విషయం తెలిసిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. హంద్రీ నది కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్. రవీంద్రబాబును ఆదేశించినట్లు సమాచారం. ఎట్టకేలకు మేలొన్న కేఎంసీ అధికారులు నదిని పూడ్చిన ప్రదేశంలో పచ్చదనం, పరిశుభ్రత పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.8 లక్షలతో సిమెంట్ స్తంభాలు, కంచె ఏర్పాటుతో పాటు పచ్చదనం కోసం వివిధ మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కంచె ఏర్పాటుకు సిమెంట్ పోల్స్ నాటారు. అయితే... హంద్రీ నది ప్రక్షాళన, ఆక్రమణలకు గురి కాకుండా సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వ అధికారులే హంద్రీ ఒడ్డున ఓ ప్రణాళిక ప్రకారం పూడ్చేయడం విమర్శలకు తావిస్తుంది. దీనిపై జలవనరుల శాఖ ఎఫ్‌ఆర్‌ఎల్ డివిజన్ డీఈఈ రామకృష్ణ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా హంద్రీ నది సంరక్షణలో భాగంగా సరిహద్దులు గుర్తించేందుకు త్వరలో సర్వే చేయబోతున్నామన్నారు. ఇప్పటికే సరిహద్దు రాళ్లను సిద్ధం చేశామన్నారు.



హంద్రీ నది

అలరించిన అవధానం



అష్టావధానంలో పాల్గొన్న పృశ్చికులను సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులోని మిలటరీ కాలనీలో ఉన్న జడ్పీ ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరిగిన అష్టావ ధానం ఆద్యంతం ఆకట్టుకుంది. వర్ధమాన అవధాని, దంత వైద్యుడు డాక్టర్ బోరెల్లి హర్ష నిర్వహించిన ఈ అవధాన కార్యక్రమంలో పండితులతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు ఉప విద్యాశాఖ అధికారి ఎన్.హనుమతరావు హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు సి. రాజేశ్వ రమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ. హనుమంతరావు మాట్లాడుతూ అవధాన ప్రక్రియ తెలుగు భాషలో ప్రత్యేకంగా నిలుస్తుందని చెప్పారు. కాగా ఈ అష్టావధాన కార్య క్రమంలో సుధాకర శర్మ (నిషిద్ధాక్షరి), ప్రముఖ కవి తొగట సురేష్‌బాబు (సమస్య), నంది నాటక న్యాయ నిర్ణేత, రిటైర్డ్ హెచ్‌ఎం యర్రమ పాండురంగయ్య (పురాణ పఠనం), కవయిత్రి డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని (వర్ణన), శతకకర్త వరలక్ష్మి (న్యస్తాక్షరి), తెలుగు పండితుడు దేవవరం (ఆశువు), తెలుగు పండితుడు పి.రాఘవయ్య (యాం త్రిక గణనం), పాఠశాల ఉపాధ్యా యుడు శ్రీనివాసులు (అప్రస్తుత ప్రసంగం)లతో ఈ అష్టావధానం కొనసాగింది. అనంతరం అవధాని బోరెల్లి హర్షతో పాటు కవులు, తెలుగు పండితులను ఘనంగా సత్కరించారు.

బడి బాగుండాలని..!

(5వ పేజీ తరువాయి)

కోడుమూరు మండలం కలపరి జడ్పీ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 179 మంది విద్యార్థులు చదువుతున్నారు. 9 అదనపు తరగతి గదులు మంజూరు చేస్తే.. ఐదు గదులు నిర్మాణం దాదాపుగా పూర్తి చేశారు. రంగులు, విద్యుత్ పరికరాలు, కిటికీలు పనులు చేయాలి. గత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగిస్తున్నారు.

మన బడి-మన భవిష్యత్తు ఫేజ్-2 వివరాలు:

ఎంపిక చేసిన విద్యాలయాలు	1,074
మంజూరు వివిధ పనులు	1,746
అదనపు తరగతి గదులు	311 పాఠశాలలు, 1,311 గదులు
ప్రహరీలు	367 పాఠశాలలు
అంచనా విలువ	రూ.520 కోట్లు
చేసిన ఖర్చు	రూ.276 కోట్లు
తాజాగా ఇచ్చిన నిధులు	రూ.29.83 కోట్లు

కూటమి ప్రభుత్వం 'మన బడి-మన భవిష్యత్తు' ఫేజ్-2 కింద తొలి విడతగా రూ.29.83 కోట్లు మంజూరు చేయడంతో 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అసంపూర్తి పనులు పూర్తి చేసి బడులు పునఃప్రారంభం నాటికి విద్యార్థులు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు.

- గూడూరు మండలంలో 31 పాఠశాలలకు గత వైసీపీ హయాంలో నాడు-నేడు కింద అదనపు తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, మైనర్ రిపేరి వంటి పనులు మంజూరు చేశారు. నిధులు లేకపోవడంతో జులకల్లు, మునగాల, వై.ఖానాపురం, బూడిదపాడు, చనుగొండ్ల, పెంచికలపాడు, పొన్నకల్ గ్రామాల్లో అదనపు తరగతి గదులు అసంపూర్తిగా ఆగిపోయాయి.
- జిల్లాలో వైసీపీ హయాంలో నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన వివిధ నిర్మాణాల పరిస్థితి ఇదాలు ఇలాగే ఉంది. టీడీపీ

జిల్లాకు రూ.29.83 కోట్లు:

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మన బడి-మన భవిష్యత్తు ఫేజ్-2 కింద రాష్ట్రంలో 22,344 పాఠశాలలు, ఇతర విద్యా సంస్థల్లో రూ.8 వేల కోట్లలో మౌలిక వసతుల కల్పన పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. అందులో తొలి విడతగా 407.91 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో అత్యధికంగా కర్నూలు జిల్లాకు రూ.29.83 కోట్లు, నంద్యాల జిల్లాకు 11.71 కోట్లు కేటాయించారు. నిధులు రావడంతో ప్రభుత్వ బడులకు మహర్దశ రానుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో అసంపూర్తిగా ఆగిపోయిన జడ్పీ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణాలు



కోడుమూరు మండలం కలపరి జడ్పీ ఉన్నత పాఠశాల దుస్థితి ఇది

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

తుగ్గలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏటా సాగు చేసిన పంటలు అప్పులే మిగులుస్తుండటంతో బుధవారం అర్ధరాత్రి పుండుకూర రామాంజనేయులు (45) అనే రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని మారెళ్లలో జరిగింది. రైతు తనకున్న ఎకరా పొలంతో పాటు మరో పదెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ, కంది, టమోటా పంటలు సాగు చేశారు. ఏటా సాగు ఖర్చు కూడా తిరిగి రావడం లేదు. దాదాపు రూ.15 లక్షల మేర అప్పులు అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక రామాంజనేయులు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా.. ఉరితాడుకు వేలాడుతూ రామాంజనేయులు కనిపించాడు. వాళ్లు హడావిడిగా పత్తికొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు రైతులు ధృవీకరించారు. మృతునికి భార్య మహేశ్వరమ్మ, ఒక కుమారుడు ఉన్నారు. మహేశ్వరమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

పాణ్యం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మరాజుపల్లెకు చెందిన ఎం. శివమ్మపై జరిగిన హత్యాయత్నం కేసులో బేతంచెర్లకు చెందిన సందోలి అంజి, మాదిగ హరినాథ్‌కు నంద్యాల ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ న్యాయాధికారి రాధారాణి ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 11 వేలు జరిమానా విధించినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన శివమ్మ తన కోడలు, నిందితుల్లో ఒకరు సన్నిహితంగా ఉంటున్నారని కోడలిని నిత్యం వేధించేవారు. దీంతో శివమ్మ కోడలు విజయలక్ష్మి నలుగురు వ్యక్తులతో కలిసి 2017 ఏప్రిల్ 5వ తేదీన రాత్రి 11.20 గంటలకు శివమ్మపై కత్తులతో దాడి చేశారు. ఆమె చనిపోయిందని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే కొన ఊపిరితో ఉన్న శివమ్మను ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రాణాలతో భయటపడ్డారు. దీంతో శివమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి పాణ్యం ఎస్ఐ చిరంజీవి శివమ్మ కోడలు విజయలక్ష్మి, బేతంచెర్లకు చెందిన అంజి, హరినాథ్, కర్నూలుకు చెందిన చెన్నకేశవులు, మగ్బూల్ బాషాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే వీరిలో ముగ్గురు చనిపోగా.. మిగిలిన ఇద్దరిని విచారించి కేసు రుజువైనందున శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని చెప్పారు.

రూ.1.5 కోట్లకు చిరు వ్యాపారి ఐపీ

ఎమ్మిగనూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మసీదుపురం గ్రామంలో ఓ చిరు వ్యాపారి ఏకంగా రూ. కోటిన్నరకు ఐపీ పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలివీ.. గ్రామంలో కొంతకాలంగా ఓ దుకాణాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్న వ్యాపారి గ్రామంతో పాటు చుట్టు ముట్టు గ్రామాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలతో పాటు ఇతరుకు వడ్డీ ఆశచూపి ఒకరి తెలియకుండా మరొకరి దగ్గర ఇలా దాదాపు 60నుంచి 70 మంది దగ్గర రూ. కోటిన్నర మేరకు అప్పు తీసుకున్నాడు. అయితే తీసుకున్న డబ్బును తిరిగి చెల్లించకుండా సాకులు చెప్పుకుంటూ రోజులు గడిపాడు. అయితే అప్పులు ఇచ్చిన వారందరికీ ఐపీ నోటీసులు ఇచ్చాడు. ఐపీ నోటీసులు రావటంతో అప్పు ఇచ్చిన వారంతా లబోదిబోమంటున్నారు.

విద్యుత్ తీగలు తాకి రైతు మృతి

పాములపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట కోత కోసేందుకు కోత మిషన్‌పై వెళ్తూ విద్యుత్ తీగలు తగిలి రైతు కామేశ్వరరావు (48) మృతి చెందారు. వివరాలివీ.. క్రిష్ణానగర్ గ్రామానికి చెందిన రైతు కామేశ్వరరావు గురువారం రాత్రి సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో గ్రామ శివార్లలోని వేంపెంట పొలిమేరలో తన మొక్కజొన్న పంట కోయించేందుకు కోతమిషన్‌పై బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక ఇవ్వండి

- నీటి విడుదలలో అక్రమాలకు పాల్పడకుండా పర్యవేక్షించాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల వివరాలతో పాటు ప్రతిపాదించిన ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టుల పరిస్థితిపై కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పందికోన రిజర్వాయరు ద్వారా మరింత ఆయకట్టుకు నీరందించేందుకు వీలుగా రిజర్వాయరుకు సంబంధించి మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు రూ.210 కోట్లుతో రూపొందించిన ఎస్టిమేట్స్‌ను త్వరితగతిన ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న హంద్రీనీవా విస్తరణ పనులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఈ ఏడాది జూన్‌లోపు పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా ద్వారా 68 ట్యాంకులను నింపడంలో భాగంగా జిల్లాలో ఉన్న 39 చెరువులకు గాను ఇప్పటి వరకు 33 చెరువులకు నీరు నింపారని, మిగిలిన ట్యాంకులను కూడా త్వరితగతిన నింపాలని అన్నారు. 33 చెరువులు ఫుల్‌గా నింపారా? అని కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. 23 ట్యాంకులను ఫుల్‌గా నింపాలని, 10 ట్యాంకులను పాక్షికంగా నీరు నింపామని అధికారులు తెలుపగా.. పూర్తి వివరాలు తనకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జలవనరుల శాఖ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డి, హంద్రీనీవా ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈలు, డీఈలు శైలేష్, రామకృష్ణ, విజయకుమార్ పాల్గొన్నారు.